క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నవగ్రహ మండపం ప్రతిష్ట

ఎల్.ఎన్.పేట: మండలంలోని గార్లపాడు (తాయిమాంబాపురం) పునరవాస కాలనీలో నవగ్రహ మండపం ప్రతిష్ట మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉమా కాశీవిశ్వేశ్వర ఆలయంలో 30 మంది దంపతులతో ప్రతిష్ట మహోత్సవాన్ని 14 మంది వేదపండితులతో నిర్వహించినట్లు సర్పంచ్ తొత్తడి మురళీకృష్ణ తెలిపారు. బుధవారం నిర్వహించనున్న పూజా కార్యక్రమాల్లో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

ఆమదాలవలస: పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ పూర్తిస్థాయిలో సేవలు అందించాలని పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ ఎం.కిశోర్ సూచించారు. మంగళవారం ఆమదాలవలస పట్టణంలోని పశువైద్యశాల (ఏడీ కార్యాలయం) వద్ద పశువైద్యాధికారులు, సచివాలయ పశుసంవర్థక శాఖ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ అందిస్తున్న పథకాలు పాడి రైతులకు అందజేయాలన్నారు. వేసవిలో ప్రబలే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ గ్రామంలో పశువైద్య సిబ్బంది పర్యటించాలన్నారు. వ్యాధుల నివారణకు ముందస్తుగా టీకాలు వేయాలని సూచించారు. ఆమదాలవలస ఏడీ ఆర్.ఆనందరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

7న జిల్లా స్థాయి బల ప్రదర్శన పోటీలు

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామంలో మార్చి 7న జిల్లా స్థాయి బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. గ్రామంలో గల త్రినాథస్వామి ఆలయ 66వ వార్షికోత్సవం పురస్కరించుకుని గ్రామానికి చెందిన ఇప్పిలి గణపతిరావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఈ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ పోటీల్లో బంపర్లు ఎత్తడం, సంగిడి, విసురుగుండు పోటీలుంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 9502382777 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు కసరత్తు

నరసన్నపేట: మండలంలో 8 వార్డు మెంబర్లు, ఒక ఎంపీటీసీ స్థానానికి పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కరగాం ఎంపీటీసీగా ఎన్నికైన పంగ బావాజీ నాయుడు రాజీనామా చేయడంతో ఈ స్థానం ఖాళీ అయింది. దీనికి పోలింగ్ నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. నరసన్నపేట మేజరు పంచాయతీలో 7వ వార్డు, కోమర్తిలో 3వ వార్డు, మడపాంలో 8వ వార్డు, మాకివలసలో 2వ వార్డు, దూకులపాడులో 8వ వార్డు, తెలగవలసలో 1, 8వ వార్డులు, చోడవరంలో 8వ వార్డుకు పోలింగ్ జరగనుంది. పంచాయతీ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను ఉంచినట్లు ఈఓపీఆర్డీ రవికుమార్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు అధికారులను నియమించామన్నారు.


ప్రణాళికలతో గ్రామాల అభివృద్ధి

ఆమదాలవలస రూరల్: గ్రామాలు అభివృద్ధి బాటలో పయనించాలంటే సుస్థిర ప్రణాళికలు తయారుచేసుకోవాలని ఎంపీడీఓ ఎం.రేణుక అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ శాఖల అధికారులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయంలో శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల అనుకున్న స్థాయిలో అభివృద్ధి సాధించలేకపోతున్నామని తెలిపారు. ప్రతీ శాఖ తమ విధులను, పనులను సక్రమంగా నిర్వహించుకుంటే అనుకున్న రీతిలో అభివృద్ధి సాధించలేమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత గల లబ్ధిదారులకు అందజేసేలా పనిచేయాలన్నారు. అందరికీ విద్య, వైద్యం, ఆరోగ్యం, పౌష్టికాహారం, సామాజిక భద్రత కల్పించడానికి సచివాలయ సిబ్బందితోపాటు అన్ని శాఖల ఉద్యోగులు సక్రమంగా పనిచేయాలన్నారు. ఎంఈఓ డి.రామారావు, ఏపీఎం కూర్మారావు, ఐసీడీఎస్ పీఓ బాలామణి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటినుంచి జడ్డమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు

పాతపట్నం: మండలంలోని బూరగాం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత జడ్డమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు సర్పంచ్ బిజిలి పుల్లాయ్ తెలిపారు. మూడు రోజుల పాటు ఆలయంలో శిలావిగ్రహ ప్రతిష్ఠాపన, హోమాలు, పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

సస్యరక్షణతో నారు సంరక్షణ


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సరుబుజ్జిలి: సస్యరక్షణ చర్యలతో వరినారుకు ఎటువంటి చీడపీడలు సోకకుండా కాపాడవచ్చునని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. మండలంలోని రొట్టవలస గ్రామంలో మంగళవారం సస్యరక్షణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సూర్యానారాయణ, ధనరాజు, అహమ్మద్, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు.. అభయం

- మండలానికో భవిత కేంద్రం
- వారంలో ఒక రోజు ఫిజియోథెరపీ సేవలు
- ఉచితంగా పరికరాలు పంపిణీ


ఆమదాలవలస మండల విద్యార్థికి వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపీ వైద్యురాలు

ఆమదాలవలస రూరల్: ప్రత్యేక అవసరాల చిన్నారుల భవితకు ప్రభుత్వం బాటలు వేస్తోంది. మండల కేంద్రాల్లో ప్రత్యేక భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి వారిని సాధారణ పిల్లలు మాదిరిగా తీర్చిదిద్దుతోంది. వారిలో సృజనాత్మకతను వెలికితీసి, సాధారణ పిల్లలతో కలిసి సాగేలా చర్యలు చేపడుతోంది. ఇంటి వద్ద వీలయ్యే స్థాయిలో ఫిజియోథెరపీ అందిస్తోంది. వారంలో ఒక రోజు ప్రతీ మండలంలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరఫీ క్యాంప్ నిర్వహిస్తున్నారు. కేంద్రాలకు రాలేని స్థితిలో ఉన్న చిన్నారులకు ప్రతీ శనివారం ఇంటి వద్దకే విద్య అనే కార్యక్రమం ద్వారా వారికి ప్రత్యేక పద్ధతుల్లో పాఠాలను బోధిస్తున్నారు.

ప్రతీ మండలంలో సేవలు

ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లోని 13 మండలాల్లో భవిత కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 1942 మంది చిన్నారులున్నారు. వీరిలో 241 మంది భవిత కేంద్రాలకు వస్తున్నారు.


పొందూరు మండల భవిత కేంద్రంలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

1701 మందిలో కొంత మంది ఇంటి వద్ద, మరికొంత మంది ఇతర పాఠశాలల్లో చదువుకుంటున్నారు. ప్రస్తుతం 241 మంది విద్యార్థులకు ఐఈఆర్టీలు(ఇన్‌క్లూజివ్ ఎడ్యూకేషన్ రిసోర్స్ టీచర్), ఆయాలను నియమించారు. ఈ కేంద్రాలకు వారానికి ఒకసారి ఫిజియోథెరఫీ ట్రైనర్ వచ్చి వ్యాయామం చేయిస్తారు. ఇంట్లో వ్యాయామం ఎలా చేయించాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.

భవిత కేంద్రాలు, చిన్నారుల వివరాలు..

మండలం	మొత్తం చిన్నారులు	భవిత కేంద్రానికి వచ్చే చిన్నారులు
ఆమదాలవలస	127	23
సరుబుజ్జిలి	97	15
పొందూరు	130	20
బూర్జ	243	20
నరసన్నపేట	134	20
జలుమూరు	125	20
సారవకోట	121	15
పోలాకి	242	20
పాతపట్నం	161	19
హిరమండలం	120	16
కొత్తూరు	115	20
మెళియాపుట్టి	182	14
ఎల్ఎన్‌పేట	145	19

పిల్లల్లో మార్పు తీసుకువచ్చేందుకు కృషి



ప్రత్యేక అవసరాల చిన్నారులకు వసతులన్నీ సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. భవిత కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వపరంగా అందిస్తున్న సంక్షేమ పథకాలను గుర్తించి తెలియజేస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. భవిత కేంద్ర సేవల వివరాలను తెలియజేస్తున్నాం. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ అందించి వారిలో మార్పు వచ్చేందుకు కృషి చేస్తున్నాం.

– బొడ్డేపల్లి లక్ష్మీప్రసన్న, ఫిజియోథెరపీ వైద్యురాలు, ఆమదాలవలస భవిత కేంద్రం

భవిత కేంద్రాల్లో అందుతున్న సేవలు

- మానసిక చిన్నారులకు రూ. 14 వేల విలువైన ఎంఆర్ కిట్ ఉచితంగా అందిస్తారు.
- మధ్యాహ్న భోజనంతోపాటు బస్సు పాసులను ఇస్తారు.
- హియరింగ్ మిషన్, మూడు చక్రాల కుర్చీ తదితర వాటిని ఉచితంగా అందిస్తున్నారు.
- అత్యంత తీవ్రమైన మానసిక వైకల్యం కలిగిన వారికి ప్రధానంగా దినసరి కార్యక్రమాలు (కాలకృత్యాలు) ఎలా చూసుకోవాలో కృత్యాల (యాక్టివిటీ) ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారు.
- మానసిక దివ్యాంగులకు దృశ్యరూపక వస్తువుల ద్వారా (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) విద్యార్థులకు సులభ పద్ధతిలో అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నారు.
- చెవిటి, మూగ విద్యార్థులకు స్పీచ్ థెరపీలో ఫ్లాష్ కార్డు (అక్షరాల బొమ్మ) లిప్ రీడింగ్, టచ్ ద్వారా అక్షరాలు నేర్పిస్తారు.
- దివ్యాంగుల్లో వైకల్య శాతం తగ్గి వారు ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా పనులు చేసుకునేలా తర్ఫీదు ఇస్తారు.

సాధారణ పిల్లలతో మెలిగేలా శిక్షణ



ప్రత్యేక అవసరాల చిన్నారులు మిగతా పిల్లలతో సమానంగా మెలిగేలా శిక్షణ ఇస్తున్నాం. వారిలో వైకల్య తీవ్రతను తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. పిల్లల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నాం. ఆటపాటలతో వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– పూజారి శ్రీధర్, ఐఈఆర్ టీచర్, ఆమదాలవలస మండలం

సుధాకర్‌ను గెలిపించాలి

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్


మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

పొందూరు: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ కోరారు. మంగళవారం పొందూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసిన తర్వాత ఇతరులకు రెండో ప్రాధాన్యత ఓటుకు ప్రాముఖ్యత ఇవ్వొద్దని కోరారు. పొందూరుకు సంబంధించి పట్టభద్రుల ఓటర్లను మూడు పోలింగ్ బూత్‌ల ప్రతినిధులు గుర్తించాలన్నారు. పట్టభద్రులు అభివృద్ధిని కోరుతూ ఓటును వేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, నాయకులు బాడాన సునీల్, బాడాన కృష్ణ, ప్రతాప్, కిల్లాన సూర్యారావు, గుడ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

పాతపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. పాతపట్నంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయని, పాతపట్నంలో రెండు (5, 6) పోలింగ్ కేంద్రాలు ఒకేచోట కేటాయించామన్నారు. ఎన్నికలకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. శాంతిభద్రతల విషయమై సీఐ ఎం.వినోద్‌బాబును అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కె.రవిచంద్ర, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు, డీటీ బి.ప్రసాద్, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రెండవ విడత రీ సర్వేను వేగవంతం చేయాలి..

జగనన్న భూసర్వే రెండవ విడత రీ సర్వేను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులకు టెక్కలి సబ్ కలెక్టర్ ఆదేశించారు. పాతపట్నం తహసీల్దార్ కార్యాలయంలో పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట మండలాల రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రీ సర్వేను వేగవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్‌లు రవిచంద్ర, సరోజిని, ప్రవల్లికప్రియ, సబ్ డివిజన్ సర్వేయర్ జనార్దనరావు, మండల సర్వేయర్లు రామగణపతి, చలపతిరావు, మహేష్, వీఆర్వోలు, సచివాలయ అసిస్టెంట్ సర్వేయర్లు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న నారాయణరావు

పాతపట్నం: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిల్లారి నారాయణ రావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం మార్చి ఒకటవ తేదీన శ్రీకాకుళంలో జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు హాజరుకావాలని, ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ఏఓ కె.అప్పలనాయుడు, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండా, సెక్రటరీలు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు


సరుబుజ్జిలి: వీరభద్రాపురంలో అమ్మవారి జాతరకు పోటెత్తిన జనం

మెళియాపుట్టి: హీరాపురంలో రేణుకా ఎల్లమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అరటి గెలలతో ఆలయాన్ని అలంకరించారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి కోళ్లు, మేకలతో మొక్కులు చెల్లించుకున్నారు. ముర్రాటలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన వైశ్య సంఘం సభ్యులు ఉత్సవాలకు వచ్చిన భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎల్లమ్మ ఘటాలతో పురవీధుల్లో ఊరేగించారు.


మెళియాపుట్టి:హీరాపురంలోని ఎల్లమ్మ గుడిలో వేలాడదీసిన అరటిగెలలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని మిరియాపల్లి గ్రామంలోని సిర్ల ఎల్లమ్మ జాతరను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట, పెద్దకోట, బసవరాజుపేట, ధనుకువాడ, దబ్బపాడు, వాడవలస, తురకపేట, చింతలబడవంజ, శ్యామలాపురం తదితర గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి సిర్ల ఎల్లమ్మను దర్శించుకున్నారు.

హిరమండలం: పెరికి వీధిలో గల సిర్లి పోతన్న, ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ఉదయం నుంచే భక్తులు బారులు తీరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఇంటింటికీ వెళ్లి సేకరించిన జోగి (బియ్యాన్ని) ఎల్లమ్మ సన్నిధిలో సమర్పించారు. విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి.


హిరమండలం: ఎల్లమకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సరుబుజ్జిలి: రఘ్రాపురంలో గల రేణుకా ఎల్లమ్మ (సిర్లి పోతన్న) జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. సన్నిధానంలో ఉన్న పుట్టకు పూజలు చేసి తదుపరి భక్తులను అమ్మవారి దర్శనం కోసం ప్రవేశం కల్పించారు. భక్తులు అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సృజనకు వేదిక.. విజ్ఞాన వీచిక

- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను సందర్శించి, వాటి పనితీరును వివరించారు. ప్రాజెక్టుల రూపకల్పనలో సృజనాత్మకతను అధికారులు ఉపాధ్యాయులు మెచ్చుకున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు మరింత బాగా రాణించి, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం సైన్స్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్


నరసన్నపేట: జెడ్పీ (బోర్డు)ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈఓ యు.శాంతారావు


ఆమదాలవలస రూరల్: కొర్లకోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఉపాధ్యాయులు


ఎల్.ఎన్.పేట: కేజీబీవీలో సైన్స్ ప్రదర్శనలను తిలకిస్తున్న ఉపాధ్యాయుడు ఎం.కె.మిశ్రో, తదితరులు


పాతపట్నం: ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థులు తయాచేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు


సారవకోట: కేజీబీవీ విద్యార్థుల ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల గురించి తెలుసుకుంటున్న ఎంఈఓ ఎం.వి.రమణ


కొత్తూరు: నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


హిరమండలం: కేజీబీవీలో ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎంఈఓ రాంబాబు


సరుబుజ్జిలి: కొండవలస ప్రాథమికోన్నత పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై ఫిర్యాదు


విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ దుప్పల రామారావు

ఆమదాలవలస రూరల్: మండలంలో అక్కివరం గ్రామ పంచాయతీ పరిధిలో గల కొత్తరోడ్డు జంక్షన్‌లో ఉన్న వెలాసిటీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓకు, పోలీసులకు మంగళవారం వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. గత మూడు నెలల నుంచి సరిగా బోధనలు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. విద్యా సంవత్సరం ఆఖరి దశలో ఇలా చేయడం వల్ల విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. స్కూల్ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకుని విద్యాసంవత్సరం పూర్తి చేసేలా న్యాయం చేయాలని కోరారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎంఈఓ దుప్పల రామారావు స్కూల్‌కు వెళ్లి విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు. స్కూల్ యాజమాన్యం పనితీరు సరిగ్గా లేనందున ఈ విషయాన్ని డీఈఓకు ఫిర్యాదు చేశారు. గతంలో తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు వస్తే విచారణ చేపట్టి తరగతులు నిర్వహించాలని సూచనలు చేసినా మార్పు రాలేదన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో ఇలా చేయడం వల్ల విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్కూల్ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఘనంగా టైలర్స్ డే


పాతపట్నం: పతాకావిష్కరణ చేస్తున్న యూనియన్ అధ్యక్షుడు, సభ్యులు

పాతపట్నం: స్థానిక ఆల్ఆంధ్రా రోడ్డు కూడలి వద్ద టైలర్స్ డే సందర్భంగా సాయిదుర్గ టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు కొంచాడ ప్రభాకర్ మంగళవారం పతాక ఆవిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ టైలర్లు అందరూ కలసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదరణతో టైలర్స్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, ప్రతి సంవత్సరం ప్రభుత్వం టైలర్‌కు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.


హిరమండలం: కుట్టు మిషన్ రూపకర్త చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టైలర్లు, నాయకులు

హిరమండలం: మండల కేంద్రంలో టైలర్స్ డేను మండల టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కుట్టుమిషన్ రూపకర్త ఎలియాస్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టైలర్లకు చేతోడు పథకం కింద రూ.10 వేలు అందించి ఆదుకుంటున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సరుబుజ్జిలి: మండల కేంద్రంలో టైలర్ల డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వైఎస్సార్‌సీపీ నాయకులు తొత్తడి సురేష్, దర్జీల సంఘం నాయకులు పాల్గొన్నారు.